
ప్రజాశక్తి
శనివారం 8 జులై 2023
5
పార్వతీపురం మన్యం



మరో గిరిజన నాయకునికి గుర్తింపు



ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా డాక్టర్ డివిజి శంకరరావు నియామకం చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇంతవరకు చైర్మన్ గా ఉన్న కుంభా రవిబాబుని గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నియమించడంతో ఆ పోస్టుని శంకరరావుకు కేటాయించారు. సాలూరు మండలం పెదపదం పంచాయతీ పాలికవలసకు చెందిన ఆయన తెలుగుదేశం తరపున పార్వతీపురం ఎంపిగా రాజకీయ ప్రస్తానం ప్రారంభమైంది. అనంతరం కొన్నేళ్లు రాజకీయంగా దూరంగా ఉన్నారు. అనంతరం నెల్లిమర్ల మిమ్స్ ఆస్పత్రిలో ఎనాస్తీసియా బోధకుడిగా పనిచేస్తూ వైసిపిలో చేరారు. ఆయన సేవలను గుర్తించిన ముఖ్యమంత్రి గిరిజన కమిషన్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు అప్పగించారు.

ప్రాధాన్యతా భవనాలను ప్రారంభించాలి

- ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తాం
- తోటపల్లి భూసేకరణ వెంటనే పూర్తిచేయాలి
- మంత్రి బొత్స సత్యనారాయణ
- జెడ్‌పి సర్వసభ్య సమావేశంలో పలు అంశాలపై చర్చ
- విజయనగరం మండలంలో మరో పిహెచ్‌సికి తీర్మానం

ప్రజాశక్తి - విజయగరం ప్రతినిధి

ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాలను వెంటనే ప్రారంభించాలని విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. నిర్మాణం పూర్తయిన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లను ప్రారంభించి అందుబాటులోకి తేవాలన్నారు. నిర్మాణ దశలోనూ, ఆగిపోయిన వాటికి సంబంధించి నియోజకవర్గాల వారీగా సమీక్షా సమావేశాలను ఏర్పాటు చేయాలని సూచించారు. జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన జిల్లా పరిషత్తు సర్వసభ్య సమావేశం శుక్రవారం జరిగింది. వివిధ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. విజయనగరం మండలంలో మరో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని, గరుగుబిల్లి, బలిజిపేట మండలాలను పార్వతీపురం విద్యుత్తు డివిజన్ పరిధిలో చేర్చడానికి సభ తీర్మానించింది. ఈ ఏడాది ఖరీఫ్‌కు అవసరమైన విత్తనాలు, ఎరువులు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని, వ్యవసాయ శాఖ, జలవనరుల శాఖలపై సమీక్ష సందర్భంగా మంత్రి బొత్స చెప్పారు. గతేడాదితో పోలిస్తే, ఈ ఏడాది జూన్‌లో ఉమ్మడి జిల్లాలో సుమారు 50 శాతం వరకు లోటు వర్షపాతం ఉన్నా, ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఏ మండలానికైనా అదనంగా విత్తనాలు కావాలంటే సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. తోటపల్లి ప్రాజెక్టు భూసేకరణను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. కాలువల పనులు పూర్తి చేయాలని సూచించారు.

● డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర మాట్లాడుతూ చెరువు మధ్యలోనుంచి కాలువ తవ్వడం వల్ల ఇబ్బంది పడే అవకాశం ఉందని, అటువంటి వాటిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

● జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ తోటపల్లి ప్రాజెక్టు నుంచి 40 రోజుల ముందుగానే నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. శివారు భూములకు నీరు చేరేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. వర్షాలు బాగా కురిస్తే, ఈ నెలాఖరుకు వెంగళరాయసాగర్ నుంచి నీటిని విడుదల చేస్తామని తెలిపారు. ఇ-క్రాప్ నమోదులో ఎక్కడా తప్పులు జరగకుండా చూడాలని సూచించారు. ● ఎమ్మెల్సీ రఘురాజు మాట్లాడుతూ శృంగవరపుకోటలో చిలకలగెడ్డ, జెఎ ఛానల్‌లో భూ ఆక్రమణలు తొలగించాలని, అందుకు రైతులు కూడా సహకరించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ● ఎమ్మెల్సీ సురేష్‌బాబు మాట్లాడుతూ బిసి సంక్షేమ వసతిగృహాల్లో ఇన్‌ఛార్జి వార్డెన్ల వల్ల ఎదురవుతున్న సమస్యలను ప్రస్తావించారు. ● విద్యుత్తు, పౌర సరఫరాలు, వైద్యారోగ్యం తదితర అంశాలపై చర్చలు జరిగాయి. ఈ సమావేశంలో డిప్యూటీ స్పీకర్ వీరభద్రస్వామి, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల కలెక్టర్లు నాగలక్ష్మి, నిశాంత్‌కుమార్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, జెడ్‌పి డిప్యూటీ సిఇఒ కె.రాజ్‌కుమార్, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, సభ్యులు, విజయనగరం, పార్వతీపురం జిల్లాల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ; చిత్రంలో డిప్యూటీ సిఎం రాజన్నదొర, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



రాములవలస, లోచర్లలో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు మంజూరు చేయాలి. మధుములు, స్లూయిస్‌లు బాగు చేయాలి.

- బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు



రేగిడిగెడ్డలో 14 మంది రైతులకు పరిహారం పెండింగ్‌లో ఉంది. వెంటనే దానిని విడుదల చేయాలి. కాలనీ ఇళ్లే కాకుండా, మా నియోజకవర్గంలో వ్యక్తిగత ఇళ్లను కూడా మంజూరు చేయాలి. పెండింగ్‌లో ఉన్న సిసి రోడ్ల బిల్లులు చెల్లించాలి.

- కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి



ఎమ్మెల్యే అప్పలనరసయ్య

● సమావేశంలో గజపతినగరం ఎమ్మెల్యే అప్పలనరసయ్య మాట్లాడుతూ చెరువులు, కాలువల పనులన్నీ పూర్తయ్యాకే నీటిని విడుదల చేయాలన్నారు. గంట్యాడ మండలంలో జాతీయ రహదారి నిర్మాణ సమయంలో సాగునీటి కాలువలను మూసివేశారని, దీనిపై చర్య తీసుకోవాలని కోరారు. దీనిపై సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.

● గంట్యాడ మండలం డికె పర్తిలో పొజిషన్ పట్టాలు ఇవ్వకపోవడంతో పేదలు ఇళ్లు నిర్మించుకోలేకపోతున్నారని ఆ మండల జెడ్‌పిటిసి సభ్యులు వర్రి నర్సింహమూర్తి.. సభ దృష్టికి తెచ్చారు. ముందుగా పట్టాలు ఇచ్చారని, ఇళ్లు కట్టబోతే అడ్డు చెబుతున్నారని ఎమ్మెల్యే అప్పలనరసయ్య అన్నారు.

తాగునీటి సమస్యపై చర్చ

● ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఇవ్వడంలో జాప్యం జరుగుతోందని పాచిపెంట, తెర్లాం ఎంపిపిలు సహా జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. ● తన నియోజకవర్గ పరిధిలో రూ.200 కోట్ల మేర పనులు పెండింగ్‌లో ఉన్నాయని ఎస్.కోట ఎమ్మెల్యే శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. ● ఎమ్‌పి బెల్లాన మాట్లాడుతూ కొన్నిచోట్ల వేసిన కొళాయిల ట్యాపులు విరిగిపోతున్నాయని, పనులు సక్రమంగా పూర్తి చేయలేదని చెప్పారు. ● మంత్రి బొత్స మాట్లాడుతూ ఇప్పటికే కొన్ని జెజెఎం పనులకు పిలిచినప్పటికీ, టెండర్లు దాఖలు కాలేదని వివరించారు. సవరించిన కొత్త ఎస్ఎస్ఆర్ ధరలతో తాజాగా మరోసారి టెండర్లు పిలిచి, పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.



హాజరైన సభ్యులు



ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ రాజాం, రేగిడి ఆమదాలవలస మండలాల్లో ఇళ్ల నిర్మాణం చేసినప్పటికీ బిల్లులు రాలేదని చెప్పారు. ఇళ్లు కట్టుకొని నివాసం ఉంటున్న పేదలకు పొజిషన్ పట్టాలు ఇవ్వాలని మంత్రి బొత్స అధికారులను ఆదేశించారు. బిల్లులు ఎక్కడా పెండింగ్ లేవన్నారు. డిసెంబరు నాటికి ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు.

ఎట్టకేలకు గిరిజన వర్సిటీ అడుగులు



యూనివర్సిటీ భూములను పరిశీలిస్తున్న కేంద్రబృందం

- 561 ఎకరాల్లో ఏర్పాటుకు సన్నాహాలు
- పూర్తయిన భూసేకరణ ప్రక్రియ
- యూనివర్సిటీ యాజమాన్యానికి భూమి అప్పగింత
- చినమేడపల్లి, మర్రివలస రైతులకు రూ.30.57 కోట్ల పరిహారం చెల్లింపు
- కురుపాం సభలో సిఎం ప్రకటన తర్వాత మరింత జోరందుకున్న ప్రక్రియ

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు ఎట్టకేలకు అడుగులు పడుతున్నాయి. సుమారు మూడేళ్ల క్రితమే అడ్మిషన్లు ప్రారంభించినప్పటికీ శాశ్వత భవనం నిర్మించలేదు. రాష్ట్ర విభజనలో భాగంగా ఉమ్మడి విజయనగరం జిల్లాలో గిరిజన వర్సిటీ ఏర్పాటుకు అప్పట్లో కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన విషయం విదితమే. దీని ఏర్పాటుకు తొలుత 'అదుగో ఇదిగో..' అంటూ నెట్టుకొచ్చింది. గతంలో టిడిపి, నేటి వైసిపి ప్రభుత్వాలు కూడా భూసేకరణ పేరుతో కాలం గడిపాయి. టిడిపి ప్రభుత్వంలోనే కొత్తవలస మండలం రెల్లి రెవెన్యూ పరిధిలో భూమి సేకరించి, నష్టపరిహారం కూడా చెల్లించినప్పటికీ వైసిపి వచ్చాక రద్దుచేసింది. నాలుగైదు చోట్ల భూమి పరిశీలించి చివరికి మెంటాడ మండలం కుంటినవలస మధుర గ్రామం చినమేడపల్లి, దత్తిరాజేరు మండలం మర్రివలసలో భూమిని గుర్తించారు. అనేక ఊగిసలాటల తరువాత కేంద్ర ప్రభుత్వం ఇక్కడ ఏర్పాటు చేసేందుకు అంగీకరించింది. ఈ నేపథ్యంలో విశ్వవిద్యాలయం నిర్మాణానికి 561.91 ఎకరాల భూసేకరణ ప్రక్రియ పూర్తయింది. ఈ ప్రక్రియను సకాలంలో పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.37.45 కోట్లు కేటాయించింది. సహజ సిద్ధమైన చెరువులు, నీటి గుంతలు పోగా నిర్మాణానికి అనువైన 519 ఎకరాల భూమిని ఈ నెల ఆరో తేదీన యూనివర్సిటీ యాజమాన్యానికి జిల్లా యంత్రాంగం అప్పగించింది. 'త్వరలోనే జిల్లాకు మళ్లీ వస్తాను.. గిరిజన యూనివర్సిటీ శంకుస్థాపనలో భాగస్వామ్యం అవుతాన'ంటూ ఇటీవల కురుపాం సభలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రకటించటంతో ఇక్కడ ప్రక్రియలో మరింత వేగం పెరిగింది. శంకుస్థాపనకు సెప్టెంబర్‌లో సిఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రావచ్చనే చర్చ సాగుతోంది.

80 శాతం భూమి ప్రభుత్వానికి చెందినదే

యూనివర్సిటీ నిర్మాణానికి సంబంధించి మెంటాడ, దత్తిరాజేరు మండలాల పరిధిలో సేకరించిన భూమిలో దాదాపు 80 శాతం ప్రభుత్వ భూమే ఉండటం గమనార్హం. మెంటాడ మండలం చినమేడపల్లి పరిధిలో 155.44 ఎకరాలు, దత్తిరాజేరు మండలం మర్రివలస పరిధిలో 391.17 ఎకరాల భూమి ప్రభుత్వానికి చెందినదే. రెండు గ్రామాల రైతులకు చెందిన జిరాయితీ భూమి 67.30 ఎకరాలు మాత్రమే ఉంది. మొత్తం భూమిలో 42.88 ఎకరాలు.. చెరువులు, నీటి గుంతల రూపంలో ఉన్నట్లు రెవెన్యూ అధికారులు చెప్పారు. సహజ సిద్ధంగా ఉన్న చెరువులను, నీటి గుంతలను అలాగే ఉంచి నిర్మాణాలు చేపడతారని అధికారులు పేర్కొన్నారు. గత నెలలో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఒ 265 ప్రకారం భూసేకరణ, నష్టపరిహారం చెల్లింపు ప్రక్రియను పూర్తి చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

పెదమేడపల్లి, మర్రివలస గ్రామాలకు చెందిన 99 రైతులు 67.30 ఎకరాల భూమిని అప్పగించగా ప్రభుత్వం రూ.10.47 కోట్ల పరిహారం చెల్లించింది. భూసేకరణ సమయంలో డి-పట్టాదారులు కూడా తమకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. మంత్రి బొత్స చొరవతో 279 మంది డి-పట్టాదారులకు ప్రభుత్వం రూ.13.92 కోట్లు పరిహారం అందించినట్టు అధికారులు చెబుతున్నారు. ఎలాంటి హక్కు పత్రాలు లేకుండా అనుభవదారులైన రైతులకు కూడా రూ.5.58 కోట్లు చెల్లించినట్టు వివరించారు. మొత్తం భూసేకరణ ప్రక్రియ, ఇతర అవసరాల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం రూ.37.45 కోట్లు కేటాయించింది. ఇందులో ఇప్పటికే భూములు అప్పగించిన రైతులకు రూ.30.57 కోట్లు పరిహారం కింద చెల్లించింది.

ఆశ్రమ పాఠశాల స్థలం ఆక్రమణ

సెల్ టవర్ ఏర్పాటు, అద్దె వసూలు
విశ్రాంత విఆర్ఒ ఆగడాలు

ప్రజాశక్తి - సాలూరు

తీగ లాగితే డొంక కదిలినట్లు మండలంలోని తోణాంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల స్థలం ఆక్రమణ వ్యవహారం బయటపడింది. గతనెల 24న తహశీల్దార్ బాలమురళీకృష్ణ తోణాంలో విశ్రాంత విఆర్వో నాగభూషణం, సెటిలర్ వల్లభనేని బ్రహ్మానందరావు మధ్య స్థలవివాదంపై విచారణ చేపట్టారు. తన ఇంటి పక్కన స్థలంలోకి విశ్రాంత విఆర్ఒ చొరబడి చెట్లు, మంచినీటి బోరుని ధ్వంసం చేశారని బ్రహ్మానందరావు ఫిర్యాదు చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు స్థలవివాదంపై విచారణ చేపడుతున్న సమయంలో కొత్త విషయం వెలుగులోకి వచ్చింది. నాగభూషణం ఇంటి పక్కన ఉన్న స్థలం సమీపంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలకు చెందిన స్థలమని తహశీల్దార్ నిర్ధారించారు. దీంతో అక్కడే ఉన్న పాఠశాల హెచ్‌ఎం సింహాచలంను పిలిచి విశ్రాంత విఆర్ఒ ఆక్రమణలో ఉన్న స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని సూచించారు. ఈ మేరకు పాఠశాల హెచ్ఎం సింహాచలం పార్వతీపురం ఐటిడిఎ పిఒకు లేఖ రాశారు. పాఠశాల ప్రహరీ గోడ బయట ఉన్న స్థలం పాఠశాలదేనని మండల తహశీల్దార్ చెప్పిన నేపథ్యంలో ఆ స్థలం స్వాధీనానికి ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ లేఖ రాశారు.

ఆక్రమణ స్థలంలో సెల్ టవర్ నిర్మాణం

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు చెందిన స్థలాన్ని తన స్థలంగా చూపించిన విశ్రాంత విఆర్వో ఆ స్థలంలో సెల్ టవర్ నిర్మాణానికి అనుమతి ఇచ్చారు. బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్‌ను ఏర్పాటు చేయడంతో నెలనెలా రూ.10వేలు అద్దెను నాగభూషణం పొందుతున్నారు. అయితే ఆక్రమణ స్థలం తనదేనని చెపుతున్న నాగభూషణం గతంలో పనిచేసిన మండల తహశీల్దార్ నుంచి పొజిషన్ సర్టిఫికెట్ పొందినట్లు తెలుస్తోంది. విచారణ సమయంలో తహశీల్దార్‌కు ఆ పొజిషన్ సర్టిఫికెట్‌ను నాగభూషణం చూపించగా ఆయన వారించినట్టు స్థానికులు చెబుతున్నారు. నాగభూషణం ఇప్పుడు గ్రామంలో అధికార పార్టీ నాయకుడిగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఆయనకు మండల స్థాయి నాయకుల అండదండలు ఆయనకు పుష్కలంగా ఉన్నాయి.



ఆక్రమిత ప్రభుత్వ స్థలం



ఆక్రమిత స్థలంలో నిర్మించిన సెల్‌టవర్



భామినిలో విద్యార్థుల తల్లిదండ్రులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

పేద విద్యార్థికి భరోసా.. అమ్మఒడి

ప్రజాశక్తి - భామిని

విద్యకు పేదరికం అడ్డుకాకూడదని అమ్మ ఒడి ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక చేయూత, నాడు -నేడు ద్వారా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుందని స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి అన్నారు. మండలంలోని బాలేరు ప్రాథమిక పాఠశాలలో జెసిఎస్ కో ఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్ అధ్యక్షతన అమ్మఒడి నాలుగో విడత పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో రూపురేఖలు మార్చామన్నారు. తల్లిదండ్రులకు విద్యార్థి చదువు భారంకాకుండా జెవికె కిట్ల రూపంలో అన్ని రకాలు వస్తువులు అందిస్తున్నామన్నారు. అనంతరం అమ్మఒడి ద్వారా మండలంలో 4,332మంది విద్యార్థులకు మంజూరైనా రూ.56,31,6000 చెక్కును విద్యార్థులకు అందజేశారు. అనంతరం జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా పలువురికి మంజూరైనా ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమం వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, జెడ్‌పిటిసి బొడ్డేపల్లి చిన్నమ్మి, సర్పంచ్ జామి ప్రభాకర్, కార్పొరేషన్ డైరెక్టర్ మెడిబోయిన చలపతిరావు, పిఎసిఎస్ చైర్మన్ గెల్లంకి రమేష్, వైసిపి సీనియర్ నాయకులు కొత్తకోట ఆంజనేయులు, ఎంఇఒ శ్రీనివాసరావు, భాస్కరావు, వివిధ పంచాయతీల ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.

సీతంపేట : స్థానిక గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో నాలుగో విడత జగనన్న అమ్మఒడి చెక్కును ఎమ్మెల్యే వి.కళావతి, ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సమాజంలోని బడుగు, బలహీన వర్గాల్లో అక్షరాస్యత శాతాన్ని పెంచేందుకు ఈ పథకాల ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. అనంతరం 6,075 మంది లబ్ధిదారులుకు రూ.7,89,75,000 చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి బిడ్డిక ఆదినారాయణ, జెడ్‌పిటిసి ప్రతినిధి సవర రాము, మండల కన్వీనర్ సుమిత్ర, జడ్పి కోఆప్షన్ సభ్యులు సవర లక్ష్మి, ఎంఇఒలు ఎం.ఆనందరావు, వి.సూర్యచంద్రరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.చంద్రరావు, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, వైసిపి నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికల ముందే అభ్యర్థి ప్రకటన

నియోజకవర్గ నాయకులతో చంద్రబాబు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

నియోజకవర్గానికి ప్రజామోదయోగ్యమైన అభ్యర్థిని ఎన్నికల ముందు ప్రకటిస్తామని టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు శ్రేణులకు స్పష్టం చేశారు. గత రెండు రోజులుగా పార్వతీపురం నియోజకవర్గం ఇన్చార్జి బొబ్బిలి చిరంజీవులు, రాష్ట్ర అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి జగదీష్‌తో పాటు బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబీ నాయన, బలిజిపేట, సీతానగరం, పార్వతీపురం మండల, పట్టణ పార్టీ అధ్యక్షులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో నాయకుల పనితీరుపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. పార్టీ ప్రకటించిన కార్యక్రమాల నిర్వహణ సంతృప్తికరంగా లేదని, పార్టీని ముందుండి నడిపించాల్సిన నాయకులే అధికారపక్ష ఎమ్మెల్యేతో పాటు ఇతర నాయకులతో కలిసి ఫీల్‌గుడ్ రాజకీయాలు చేస్తున్నారని, తన వద్ద సమాచారం ఉన్నట్లు హెచ్చరించినట్టు తెలిసింది. రానున్న కాలంలో విభేదాలు మరచి, పార్టీ కార్యక్రమాలను విజయవంతంగా ముందుకు తీసుకువెళ్లాలని, అలాగే ప్రభుత్వ వ్యతిరేక విధానాలను, స్థానిక ప్రజాప్రతినిధుల అవినీతి అక్రమణా లపై పెదవివిప్పి మాట్లాడాలని సూచించినట్లు తెలిసింది. నియోజకవర్గ ఇన్చార్జిగా బొబ్బిలి చిరంజీవులు చేసిన కార్యక్రమాలు సంతృప్తికరంగా ఉన్నప్పటికీ, పార్టీ క్యాడర్ కలిసి రాకపోవడంతో అనుకున్నంతగా ప్రజల్లోకి వెళ్లలేదని తమ సర్వేలో తేలిందని చంద్రబాబు వారికి తెలిపినట్టు తెలిసింది. పార్వతీపురం అభ్యర్థి ఎవరనేది ఇప్పట్లో ప్రకటించేది లేదని, పార్టీ కోసం కష్టపడి, పార్టీ ఆశయాలకు అనుగుణంగా పనిచేసే ప్రజా ఆమోదమైన అభ్యర్థిని ఎన్నికల ముందు తానే ప్రకటిస్తానని అంత వరకు పార్టీ ప్రకటించిన కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని చెప్పినట్టు తెలిసింది. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిపై మండల పార్టీ అధ్యక్షులతో విడివిడిగా సమావేశం నిర్వహించడమే కాకుండా మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్‌తో శుక్రవారం భేటీ అయి, రాబోయే కాలంలో అనుసరించాల్సిన విధానాలపై వివరించినట్లు సమాచారం.

టిడిపిని గెలిపించే బాధ్యత మీదే

భామిని : నియోజకవర్గంలో టిడిపిని గెలిపించే బాధ్యత మీదేనని ఆ పార్టీ అధినేత చంద్రబాబునాయుడు స్పష్టం చేసినట్టు స్థానిక నాయకలు తెలిపారు. పాలకొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో నాలుగు మండలాల నుంచి టిడిపి కార్యవర్గం విజయవాడలోని టిడిపి క్యాంపు కార్యాలయంలో గురువారం రాత్రి చంద్రబాబును మర్యాద పూర్వకంగా కలిసింది. స్థానికంగా చేపట్టిన కార్యక్రమాలు, పార్టీ బలోపేత అంశాలు అధినేతకు వివరించారు. ఈ సందర్భంగా జయకృష్ణ ఆధ్వర్యంలో పార్టీని మరింత బలోపేతం చేసి టిడిపిని పాలకొండ నియోజక వర్గం నుంచి గెలిపించే బాధ్యత కార్యవర్గం పై ఉందని, ఆ దిశగా క్షేత్ర స్థాయిలో సన్నద్ధం కావాలని సూచించారు. కార్యక్రమంలో తోట ముఖలింగం, మెడిబోయిన జగదీశ్వరరావు, అంపిలి కేశవ, భూపతి ఆనందరావు, బోగాపురపు రవినాయుడు వున్నారు.

సీతంపేట : పాలకొండ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేయాలని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు నియోజకవర్గ నాయకులు పడాల భూదేవికి సూచించారు. మంగళగిరి టిడిపి కేంద్ర కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో పాలకొండ నియోజకవర్గ ముఖ్య నాయకులకు దిశాదిశ చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు పడాల భూదేవికి పార్టీ బలోపేతం కోసం అందర్నీ కలుపుకొని పార్టీని మరింత పటిష్టత పర్చాలని సూచించారు. ఇప్పటి వరకు చేసిన కృషిని అభినందించారు. సీనియర్ నాయకులు సామంతల దామోదర రావు, ఖండాపు వెంకటరమణ మూర్తి, వారాడ సుమంత్ నాయుడు అభిప్రాయాలు తీసుకున్నారు. నెల రోజుల తర్వాత మళ్లీ సమీక్ష నిర్వహిస్తానన్నారు.


సమస్యల పరిష్కారం కోరుతూ
మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన

ప్రజాశక్తి - పాలకొండ

మధ్యాహ్నం భోజనం పథకంలో పనిచేస్తున్న తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక ఎంఇఒ కార్యాలయం వద్ద మధ్యాహ్నం భోజనం కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, మధ్యాహ్నం భోజనం కార్మిక సంఘం మండల కమిటీ కార్యదర్శి ఎ.పద్మావతి మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికులుగా గుర్తించి కనీస వేతనాలు ఇవ్వాలని, ప్రతి నెలా 5వ తేదీ లోపు వేతనాలు చెల్లించాలని, మార్కెట్లో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు రూ.20కు పెంచాలని, పథకానికి బడ్జెట్ పెంచాలని, గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. సామాజిక భద్రత సౌకర్యాలు కల్పించాలని, మౌలిక సదుపాయాలైన మంచినీరు, వంటషెడ్, వంట పాత్రలు, గ్యాస్ స్టవ్ ప్రభుత్వమే కల్పించాలని కోరారు. ఏడాదికి రెండు జతల యూనిఫారం ఇవ్వాలని, రాగి జావా తయారీకి గ్యాస్, వంట పాత్రలు ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. ఒక పక్క పని భారం, మరో పక్క ధరల భారం, పెరగని వేతనాలు, మెనూ చార్జీలతో కార్మికులు మధ్యాహ్నం భోజనం పథకం నిర్వహించడం కష్టంగా మారిందన్నారు. మధ్యాహ్నం భోజనం కార్మికుల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కారం చేయాలని, లేకుంటే ఐక్య పోరాటాలకు కార్మికులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎంఇఒకు వినతిని అందజేశారు. కార్యక్రమంలో బి.అపర్ణ, జి.విజయలక్ష్మి, డి.లక్ష్మి, వి.పార్వతి, కె.లక్ష్మి, కె.పద్మావతి, బి.అనసూయ తదితరులు పాల్గొన్నారు.



ఎంఇఒకు వినతిని అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు



ధ్రువపత్రాన్ని అందజేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష

ప్రజాశక్తి - సాలూరు

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని తెలుసుకుని పరిష్కరించడానికే జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టినట్లు డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర చెప్పారు. శుక్రవారం పట్టణంలోని నాయుడు వీధి, నెయ్యిల వీధుల్లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా 11రకాల సేవలు ప్రభుత్వం అందేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. పైసా ఖర్చులేకుండా పేదలకు సంక్షేమ పథకాలు అందజేశారని చెప్పారు. ఇలాంటి ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తీసుకు రావడానికి ప్రజలు సిద్ధంగా వుండాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, జర్జాపు దీప్తి, పట్టణ మాజీ అధ్యక్షుడు జర్జాపు సూరిబాబు, కమిషనర్ హెచ్ శంకరరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అంబుడ్స్‌మెన్ సన్యాసిరాజు

ఆడిట్‌పై ప్రజాప్రతినిధులతో సమావేశం

ప్రజాశక్తి - కురుపాం

గ్రామాలకు వచ్చే ఉపాధి హామీ ఆడిట్ బృందానికి ప్రజాప్రతినిధులు సహకరించాలని అంబుడ్స్‌మెన్ కె. సన్యాసిరాజు కోరారు. మండలంలో 2022 - 23లో జరిగిన ఉపాధి హామీ పనుల ఆడిట్ నిమిత్తం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎపిఒ పి.బాజీ ఆధ్వర్యంలో ఆడిట్ బృందానికి, బిటిడిఎ, ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్, ఉపాధి హామీ, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులకు కన్వర్జెన్స్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదిలో జరిగిన పనుల నిమిత్తం ప్రతి గ్రామంలో ఆడిట్ బృందం పర్యటిస్తుందని, వారికి స్థానికంగా ఉన్న ప్రజా ప్రతినిధులు సహకరించి గ్రామస్థాయిలో జరిగిన పనులన్నింటినీ ఆడిట్ బృందం పరిశీలించేలా చూడాలని అన్నారు. కార్యక్రమంలో పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎఒ అవినాష్

రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు

ప్రజాశక్తి - సీతానగరం

రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు ఎరువులు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్.అవినాష్ అన్నారు. మండలంలోని చినభోగిలి రైతు భరోసా కేంద్రంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు కావాల్సిన ఎరువులు రైతు భరోసా కేంద్రాల ద్వారా అందజేస్తామన్నారు. ఖరీఫ్‌కు సంబంధించి ఎరువులన్నీ అందజేసిందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కురుమన్న రాధా శ్రీనివాసరావు, ఎంపిటిసి సభ్యులు గుర్రాలు బుజ్జి, వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గొట్టివలసలో ఏనుగుల హల్‌చల్

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని గొట్టివలస పరిసర ప్రాంతాల్లో ఏనుగు తిష్ట వేశాయి. అలాగే గురువారం అర్ధరాత్రిలో హల్‌చల్ చేస్తూ పశువుల శాలలు, నాటుబండ్లు, తౌడు బస్తాలను ధ్వంసం చేశాయి. దీంతో గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేశారు. పార్వతీపురం- గరుగుబిల్లి ఆర్ అండ్ బి ప్రధాన రహదారి పరిధిలోని ఏనుగులు సంచరిస్తుండడంతో బిక్కుబిక్కుమంటూ వాహన చోదకులు ప్రయాణిస్తున్నారు. ప్రస్తుతం ఈ గ్రామానికి అతి సమీపంలోని మామిడి తోటల్లో ఏనుగులు తిష్ట వేయడంతో రహదారిపై ప్రయాణించేందుకు ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమేఈ ప్రాంతం నుంచి ఏనుగులను తరలించేందుకు అధికారులు తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.



విద్యార్థులకు పోషక కిట్లు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ పాపినాయుడు

పోషక కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-పాలకొండ

కిశోర బాలికలకు శుక్రవారం పెద్దకాపువీధి అంగన్వాడీ కేంద్రంలో పోషక కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 17వ వార్డు కౌన్సిలర్ దుప్పాడ పాపినాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో జాగ్రత్తలు తీసుకుంటూ కిశోర బాలికలకు ఈ కిట్లు పంపిణీ చేస్తుందని అన్నారు. దీనివల్ల రక్తహీనత నుంచి కాపాడుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త కిల్లారి సత్యవతి, మెప్మా సిబ్బంది బి.సత్యవతి తదితరులు ఉన్నారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

పిచ్చికారీ చేసినప్పుడు రైతులు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి జక్కున సౌజన్య రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని నీలానగరంలో పోలంబడి కార్యక్రమంలో మాట్లాడారు. నారుమడ్లులో ఎదురయ్యే చీడపీడ పోషక యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. పొలంగట్లపై కంది పంట వేయాలని, రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయాధికారులు, రైతులు పాల్గొన్నారు.



కంది విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎఒ సౌజన్య

ఐసిడిఎస్ వ్యతిరేక విధానాలను విడనాడాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐసిడిఎస్‌ను తీవ్రంగా నష్టపరిచే విధానాలను విరమించుకోవాలని, ఈ వ్యవస్థను బలోపేతం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై ఈ నెల 10,11 తేదీల్లో కలెక్టరేట్ వద్ద జరిగే నిరసన కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని మామిడిపల్లిలో అంగన్వాడీ వర్కర్లతో కలిసి ప్రచార పోస్టర్‌ను శుక్రవారం విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ లకు తెలంగాణ కన్నా అదనంగా వేతనం ఇస్తామని హామీ ఇచ్చిన సిఎం ఇప్పటి వరకు దాని గురించి ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని, గ్రాట్యుటీ అమలు చేయాలని, మినీ సెంటర్లకు మెయిన్ సెంటర్లలా పరిగణించాలని, పిల్లలకు అమ్మఒడి, యూనిఫాం, షూలు అందజేయాలని, తదితర సమస్యల పరిష్కారం కోసం రెండురోజులు పాటు ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. కావున మండలంలోని అంగన్‌వాడీలంతా ఈ ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు నారాయణమ్మ, శశికళ, మండల కమిటీ సభ్యులు పుష్ప, త్రివేణి, జానకి, కుమారి, సూర్యకాంతం, గంగమ్మ పాల్గొన్నారు.

పాలకొండ రూరల్: పిల్లలకు, గర్భిణీలకు, బాలింతలకు న్యాయం చేయాలని, ఐసిడిఎస్ పథకానికి నిధులు కేటాయింపు పెంచాలని కోరుతూ ఈనెల 10, 11 తేదీలలో కలెక్టరేట్ వద్ద 36 గంటల పాటు జరిగే ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని కోరుతూ ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో పాలకొండలో పోస్టర్ ఆవిష్కరణ నిర్వహించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పార్వతీపురం మన్యం జిల్లా కమిటీ కార్యదర్శి ఎన్ .హిమాప్రభ, జిల్లా కోశాధికారి బి. అమరవేణి అంగన్‌వాడీ సమస్యలపై తలపెట్టిన ఈ ధర్నాలో అందరూపాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జి.జెస్సీబాయ్, జి.శారద, పి.శారద, రజిని, ఎ.పద్మావతి, కాదా రాము, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సాలూరులో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అంగన్‌వాడీలు

టూరిజం ట్రేడ్ లైసెన్సులు తప్పనిసరి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లాలోని అన్ని హోటళ్లు, రెస్టారెంట్లు, ఫంక్షన్ హాళ్లు, బ్యూటీపార్లర్లు, లాడ్జీలు, ట్రావెల్ ఏజెన్సీలు, జిమ్ సెంటర్ల వ్యాపారాలు నిర్వహిస్తున్న వారు తప్పనిసరిగా ఏపి టూరిజం ట్రేడ్ లైసెన్సులు తీసుకోవాలని జిల్లా టూరిజం అధికారి ఎన్.నారాయణరావు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర పర్యాటక శాఖ 188 జిఒ జారీ చేసిందన్నారు. వ్యాపారులు తప్పని సరిగా ట్రేడ్ లైసెన్స్‌కు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ట్రేడ్ సర్టిఫికెట్‌తో పాటు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధి, సతి పేరిట ప్రత్యేక సర్టిఫికెట్లు జారీ చేస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు 6309942033 నంబర్లకు సంప్రదించవచ్చని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణీలు, బాలింతలు విధిగా తీసుకోవాలని ఎంపిడిఒ జి.పైడితల్లి అన్నారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రం-2ను శుక్రవారం ఆమె పరిశీలించారు. వంటలను పరిశీలించి రుచి చూశారు. కార్యక్రమంలో సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ పూడి మన్మధరావు, మహిళా పోలీసు గొర్లి భవాని, అంగన్వాడీ వర్కర్ పల్ల కష్ణవేణి తదితరులుఉన్నారు.

సంపూర్ణ పారిశుధ్యానికి చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

పట్టణంలో పరిశుభ్రత, ప్రజారోగ్యం, పర్యావరణం పరిరక్షణ, భౌతిక పరిస్థితులను అనుగుణంగా శాస్త్రీయ పరిశీలన చేసి, సంపూర్ణ పారిశుధ్య మెరుగుకు చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావుకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రమణారావు విలేకరులతో మాట్లాడుతూ పట్టణం రోజు రోజుకు విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రతి ఇంటి నుండి చెత్త సేకరణ చేస్తే సుమారు 40 టన్నులు అవుతుందని, కానీ సిబ్బంది, పనిముట్లు కొరత వల్ల రోజుకు సుమారు 15 టన్నులు మాత్రమే చెత్త తరలింపు జరుగుతుందని అన్నారు. శాశ్వత డంపింగ్ యార్డ్ నేటికీ ఏర్పాటు చేయలేదని, పట్టణాన్ని యూనిట్‌గా తీసుకొని డ్రైనేజ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని, మురికి కాలువలలో నీరు బయటికి పోయే మార్గం లేకపోవడం వల్ల ఎక్కడికక్కడ మురుకు నీరు నిల్వ ఉండే పరిస్థితి ఉందన్నారు. పూడికలతీతలకు లక్షలాది రూపాయలు ప్రతి ఏటా కాంటాక్ట్ ద్వారా ఖర్చు చేస్తున్నారని, ప్రజాధనం దుర్వినియోగం తప్ప మురికి నీరు కాలువలో ఒక చుక్క లేకుండా బయటకు పోయే మార్గం లేదని అన్నారు. మలేరియా, డెంగీ కేసుల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని, ఉన్నత అధికారులు పర్యవేక్షణ చేసి సూచనలు మాత్రమే చేస్తే సరిపోదని, ఆచరణలోకి తీసుకువెళ్లాలని కోరారు.

డిపాజిట్లు చెల్లించకపోతే ఆందోళన ఉధృతం

అగ్రిగోల్డ్ బాధితుల రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి పార్వతీపురంటౌన్

అగ్రిగోల్డ్ బాధితులకు సత్వరమే డిపాజిట్లు చెల్లించి మానసిక ఒత్తిడి నుంచి, లేకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని పలువురు వక్తలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ మేరకు స్థానిక బెలగాం రైతు బజార్ సమీపంలో గల ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయిస్ సంఘ భవనంలో అగ్రిగోల్డ్ కస్టమర్స్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు అధ్యక్షతన శుక్రవారం రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ముఖ్య అతిథులు అసోసియేషన్ గౌరవాధ్యక్షులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు, కార్యదర్శి తిరుపతిరావు మాట్లాడుతూ గత ఎన్నికల ముందు పాదయాత్రలో జగన్మోహన్ రెడ్డి అగ్రిగోల్డ్ ఏజెంట్లకు కస్టమర్లకు హామీ ఇచ్చి విస్మరించారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి పదవి కోసం డిపాజిటర్ల ఓట్లు కొల్లగొట్టి ఆ పదవి వచ్చాక కంపెనీతో వత్తాసుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. 'మాట తప్పను' 'మడమ తిప్పను' అని పాదయాత్ర సందర్భంగా పదే పదే అగ్రిగోల్డ్ బాధితులకు హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి తక్షణమే యుద్ధప్రాతిపదికన డిపాజిట్ దారులకు మేలు చేయాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 15లోగా బాధితులకు పూర్తి న్యాయం చేకూర్చాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆగస్టు 30న విజయవాడలో నిర్వహించనున్న నిరసన పోరాటాల్లో ప్రతి బాధితుడు హాజరై భవిష్యత్ పోరాటాల్లో భాగస్వామి కావాలని బాధితులను కోరారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ద్వారపురెడ్డి శ్రీదేవి మాట్లాడుతూ సమస్యను తమ అధినాయకత్వం దృష్టికి తీసుకుని వెళ్తామని, భవిష్యత్ పోరాటాలకు తమ పార్టీ తరపున మద్దతు ఉంటుందని అన్నారు. జనసేన పార్టీ నాయకులు వంగల దాలినాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తన పాదయాత్ర సందర్భంగా అగ్రిగోల్డ్ బాధితులకు ఇచ్చిన హామీ యుద్ధప్రాతిపదికన డిపాజిట్లను వారికి అందచేయాలని, దీనిపై అసోసియేషన్ చేసే పోరాటాలకు తమ పార్టీ తరపున రాష్ట్ర వ్యాప్తంగా మద్దతు తెలుపుతామని అన్నారు. బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ సమస్య పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని అన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మథనాయుడు, టిడిపి సీనియర్ నాయకులు గర్భాపు ఉదయభాను, మున్సిపల్ కౌన్సిలర్ బడే గౌరినాయుడు, జనసేన జిల్లా నాయకులు అన్నాబత్తుల దుర్గాప్రసాద్, కె. విశ్వేశ్వరరావు, గిరిజన సంఘం నాయకులు పి. రంజిత్ కుమార్, లోక్ సత్తా జిల్లా అధ్యక్షులు కె.పాపారావు, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకులు పి.సంగం, అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొత్స నర్సింగరావు, రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు ఎస్.విశ్వేశ్వరరావు, అగ్రిగోల్డ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు గెంబలి శ్రీనివాసరావు, నాయకులు ఆర్. ఆదినారాయణ, బిటిఆర్ నాయుడు, వై. గోవింద, వెంకటరమణ, ఆర్. మురళీ డాక్టర్, పి.ఈశ్వర నారాయణ, యశోద, రమాదేవి, మారోజు వెంకట్రావు, బంగారి, శ్రీరాములు, బివి రమణ, అశోక్ అధిక సంఖ్యలో అగ్రిగోల్డ్ బాధితులు, ఏజెంట్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు

మండల సమస్యలను జెడ్‌పిలో ప్రస్తావించిన ఎంపిపి

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని పేరుకుపోయిన సమస్యలను స్థానిక ఎంపిపి బి.ప్రమీల జెడ్‌పి సమావేశంలో ప్రస్తావించారు. శుక్రవారం విజయనగరంలో జరిగిన జెడ్పీ సర్వసభ్య సమావేశంలో ఎంపిపి మాట్లాడుతూ స్థానిక పిహెచ్‌సిలో గతంలో ఐదుగురు హెల్త్ అసిస్టెంట్లు ఉండేవారని, ఇప్పుడు ఒక్కరే ఉన్నారని, దీనివల్ల గిరిజన గ్రామాల్లో వైద్య సేవలు సకాలంలో అందడం లేదని, విష జ్వరాలు ప్రబలి ఇటీవలే కుంతాంలో ఐదేళ్ల బాలిక మృతి చెందిందని తెలిపారు. అలాగే పాచిపెంట బైపాస్ రోడ్డు అస్తవ్యస్తంగా ఉందని, దీంతో వాహన చోదకులు రాకపోకలు సాధించేందుకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, కావున బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. తాగునీరు సమస్య కూడా ఉందని, 40 ఏళ్ల క్రితం వేసిన పైపులైను ద్వారా తాగునీరు సరఫరా కావడంతో అది పూర్తిగా కలుషితమవుతుందని అన్నారు. కావున తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు. గ్రీన్ అంబాసిడర్లకు ఏడాది పాటు వేతనాలు చెల్లించకపోవడంతో వారు విధులు రావడంలేదని, దీంతో గ్రామాల్లో పారిశుధ్య సమస్య తీవ్రంగా ఉందన్నారు.. మండలంలో నాటుసారా అమ్మకాలు విచ్చలవిడిగా జరుగుతున్నా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీసులు పట్టించుకోవడంలేదని ఆమె ఆరోపించారు. ఈ సమస్యపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

గిరిజన సిఆర్‌టిలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వండి

ప్రజాశక్తి -బెలగాం

పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో జరుగుతున్న సిఆర్‌టిల రెన్యువల్‌లో గిరిజన సిఆర్‌టిలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ కోరారు. ఈ మేరకు గిరిజన సిఆర్‌టిల సంఘం నాయకులు ఆరిక వెంకటరావు, బిడ్డిక భవానీకుమార్‌తో కలిసి ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ గిరిజన సిఆర్‌టిలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అలాగే గత విద్యా సంవత్సరం ఏప్రిల్‌లో గిరిజన గురుకుల పాఠశాల/కళాశాలలో నియమితులైన మహిళా ఉపాధ్యాయులను ఈ విద్యా సంవత్సరం కూడా యధావిధిగా కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. దీనికి పిఒ సానుకూలంగా స్పందించారు.

నడిమికెల్లలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని నడిమికెల్లలో శుక్రవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి రక్తహీనత, బాలింతలు, గర్భిణీలు, మధుమేహ, రక్తపోటు, జ్వర పీడితులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ నయోమి, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పిఇటిలకు స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్ ఇవ్వాలి

ప్రజాశక్తి - సీతంపేట

వ్యాయామ ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి కల్పించాలని శ్రీకాకుళం జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి ఎం.సాంబమూర్తి, మన్యం జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ ప్రెసిడెంట్ ఎంవి రమణ, ఐటిడిఎ స్పోర్ట్స్ ఇంఛార్జి జాకబ్ దయానంద్, ఆనందకిరణ్ ఉమ్మడి జిల్లా కార్యవర్గ సభ్యులు డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావుకు వినతిని అందజేశారు. 2018 డీఎస్సీలో పిఇటిలుగా ఉద్యోగం పొంది రెండేళ్ల సర్వీసు పూర్తి అయిన (బిపిఇడి) అర్హత కలిగిన వారికి తక్షణమే (స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్) గా ఉద్యోగోన్నతుల ద్వారా నియమించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షులు, కార్యదర్శులు, 2018డిఎస్‌సి వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

155 కేజీల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలో ఎస్ఐ జె.తారకేశ్వరరావు తన సిబ్బందితో కలిసి శుక్రవారం వాహనాల తనిఖీ చేస్తుండగా అరకు ఏజెన్సీ వైపు నుండి ఎస్‌కోట వస్తున్న ఇన్నోవా వాహనాన్ని తనికీ చేశారని ఇంఛార్జి సిఐ సూర్యారావు తెలిపారు. ఈ తనికీలో 155 కేజీల గంజాయి పట్టుబడిందని, గంజాయిని రవాణా చేస్తున్న ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన వెల్లడించారు. పోలీసు స్టేషన్ ఆవరణలో ఎస్.ఐ తారకేశ్వరరావు, పోలీసు సిబ్బందితో కలిసి ఇంచార్జ్ సీఐ బాల సూర్యారావు శుక్రవారం విలేకరులకు వివరాలను వెల్లడించారు. ఒడిస్సా రాష్ట్రంలోని మల్కనగిరి జిల్లా మూలపుట్టు గ్రామానికి చెందిన రామనాథ్‌కిల్ అనే వ్యక్తి తన కొండ పోరంబోకు భూమిలో పండించిన 155 కేజీల గంజాయిని మహారాష్ట్రలోని బిల్వండి అనే ప్రాంతానికి చెందిన ఫరూక్ ఖురేషి, అతీక్ అహ్మద్ రఫిక్ షేక్‌లకు అమ్మకం చేశాడు. మహారాష్ట్ర వారికి ఆంధ్రప్రదేశ్ కొత్త కాబట్టి విశాఖ వరకు ఇన్నోవా వాహనంలో దారి చూపేందుకని గంజాయిని అమ్మిన రామనాథ్‌కిల్ వచ్చాడని తెలిపారు. ఈ కొనుగోలు చేసిన 155 కేజీల గంజాయి విలువ సుమారు రూ.6.20 లక్షలు ఉంటుందని చెప్పారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేయటంతో పాటు ఇన్నోవా వాహనం, మూడు సెల్ ఫోన్లు సీజ్ చేసినట్లు సిఐ వివరించారు.

నేరాలు ఘోరాలు



గాయపడ్డ బాలికను పరామర్శిస్తున్న సర్పంచ్ రామస్వామి

గోడకూలి బాలికకు గాయాలు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మండలంలోని రావికోన పంచాయతీ పరిధిలోగల కొత్తవలస గిరిజన గ్రామంలో శుక్రవారం గోడ కూలి ఐదేళ్ల బాలిక సీదరపు లలిత కుడివైపు చెయ్యి విరిగిన సంఘటన జరిగింది. శుక్రవారం వేకువజామున వర్షాలకు నానిపోయి, తడిసిపోయి ఉన్న గోడ అమాంతంగా నిద్రిస్తున్న బాలికపై కూలిపోవడంతో గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించగా, కుడి చేయి ఎముక విరిగినట్లు ఎక్స్‌రేలో తెలిసింది. ఈ విషయమై రావికోన సర్పంచి కద్రక రామస్వామి ఆసుపత్రికి వెళ్లి బాలిక కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ విషయమై స్థానిక విఆర్‌ఒకు తెలిపినా కనీసం స్పందించలేదని, గిరిజనుల విషయమై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బాలిక కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు.

యువకుడు అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి- డెంకాడ

స్థానిక పోలీస్ స్టేషన్ ఎదురుగా విజయనగరం నాతవలస ఆర్ అండ్ బి రోడ్డు పక్కన టిడిపి కార్యాలయం వద్ద అనుమానాస్పదంగా యువకుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని చోల్లంగిపేటకు చెందిన వాతాడ శేఖర్ (28) పూసపాటిరేగ మండలం కుమిలిలో బ్యాంకులో పనిచేస్తున్నాడు. గురువారం రూ.50 వేలు పట్టుకొని బయటకు వెళ్లాడు. ఈ డబ్బు తీసుకొని ఎవరో కొట్టి చంపి ఇక్కడ పడేసారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. కాగా మృతునికి ఏడాది క్రితం వివాహమైంది. భార్య వాణి కుమారితో పాటు 45 రోజుల బాబు, తల్లిదండ్రులున్నారు. కుటుంబానికి పెద్ద దిక్కైన శేఖర్ మరణంతో భార్య, తల్లిదండ్రులు కన్నీరుమున్నీరై రోధిస్తున్నారు. పోలీసులు అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రాపౌట్స్‌ను విధిగా పాఠశాలల్లో చేర్పించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

బడి బయట పిల్లలను అందుబాటులో ఉన్న పాఠశాలల్లో చేర్పించాలని మండల విద్యాశాఖ అధికారి - 2 బి. జనార్దన్ నాయుడు కోరారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న అన్ని యాజమాన్యాలకు చెందిన పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ ఏడాది ఏ పాఠశాల పరిధిలో ఉన్న ఉపాధ్యాయులు వారి పరిధిలో బడి బయట చిన్నారులు ఉండకుండా పాఠశాలల్లోనే చేర్పించాలని అన్నారు. ఎక్కడ కూడా డ్రాపవుట్స్ లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత సంబంధిత పాఠశాలల ఉపాధ్యాయులదే అని అన్నారు. సమావేశంలో పాఠశాల హెచ్‌ఎం ప్రధానోపాధ్యాయులు భీముడు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పి.దేవానంద్, హరగోపాల్, పి.ప్రసాదరావు, జిటిఎ భాస్కరరావు, డిఆర్‌పి సంజీవరావు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

డెంగీ, మలేరియాపై అప్రమత్తం

ప్రజాశక్తి - సీతంపేట

డెంగీ, మలేరియా, డయేరియా వైరల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంపిడిఒ కొండపల్లి సత్యం అధికారులకు సూచించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వైద్యాధికారులు, ఆర్డబ్ల్యుఎస్, నోడల్ అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తుండడం వల్ల కలుషిత జలాలు తాగి వ్యాధుల బారిన ప్రజలు పడతారని, వాటిని గుర్తించాలని సూచించారు. అలాగే ముందస్తుగా అవగాహన కల్పించాలని అన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. జ్వరాలుంటే గుర్తించి, వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. రక్షిత మంచినీటి పథకాల్లో క్లోరినేషన్ చేయించాలన్నారు. సమావేశంలో వైద్యాధికారులు భాను ప్రతాప్, సాయిచరణ్, బి.రవీంద్ర, ఎఇ పాపారావు, సబ్ యూనిట్ అధికారి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలతో మలేరియా నివారణ

భామిని : పంచాయతీల్లో డ్రై డే, స్ప్రేయింగ్, దోమ తెరల వినియోగంపై అవగాహన కల్పించడం ద్వారా దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులు అరికట్టవచ్చని బత్తిలి వైద్యాధికారి కొండపల్లి రవీంద్ర అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బత్తిలి, భామిని పిహెచ్‌సి పరిధిలో గల పంచాయతీ కార్యదర్శులతో దోమలు ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులైన మలేరియా, డెంగీ వ్యాప్తి అరికట్టడానికి పంచాయతీ స్థాయిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్షించారు. అనంతరం బత్తిలి వైద్యాధికారి మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో మురుగు నీరు గ్రామాల్లో నిల్వ లేకుండా చూడాలని, దోమలు వ్యాప్తి చెందకుండా స్థానిక వైద్య సిబ్బంది సూచనలు ప్రజలు పాటించేలా చూడాలని తెలిపారు.



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఒ సత్యం

జ్వరాలన్నింటికీ నిర్ధారణ పరీక్షలు

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

మండలంలోని డోకిశీల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు శుక్రవారం సందర్శించారు. ఒపి నిర్వహణ, ల్యాబ్, వ్యాక్సిన్ నిల్వలు, వార్డు, ప్రసూతి గది తనిఖీ చేశారు. ఒపి రికార్డులో నమోదు చేసిన రోగుల వివరాలు, అనారోగ్య సమస్యలు పరిశీలించారు. జ్వరలక్షణాలతో వచ్చిన వారిలో ఎంత మందికి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు, వాటి ఫలితాల వివరాలపై వైద్య సిబ్బందిని ఆరా తీశారు. పిహెచ్‌సికి వచ్చిన రోగులతో మాట్లాడి అనారోగ్య సమస్యలు తెలుసుకున్నారు. తగు సూచనలు చేశారు. సీజనల్ వ్యాధులు వస్తున్న నేపథ్యంలో రోగ నిర్ధారణ ఖచ్చితంగా జరిపి, అవసరమైన మందులు అందజేయడంతో పాటుగా, క్షేత్ర స్థాయిలో నివారణా చర్యలు చేపట్టాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ప్రసూతి గదిని తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. నెలవారీ అవుతున్న ప్రసవాల వివరాలు పరిశీలించారు. ఐఎల్ఆర్, కోల్డ్ చైన్ సిస్టమ్ నిర్వహణ, వ్యాక్సిన్ నిల్వలు తనిఖీ చేశారు. అన్ని ఆరోగ్య కార్యక్రమాలు పూర్తి స్థాయిలో అమలు చేసి ప్రగతి నివేదికలు పురోగతి సాధించాలన్నారు. అనంతరం సిబ్బంది నిర్వహించిన డ్రై డే కార్యక్రమాన్ని పరిశీలించారు. దోమల ఆవాసాలపై దృష్టి సారించి సంబంధిత శాఖల సమన్వయంతో నివారణ చర్యలు ఎప్పటికప్పుడు చేపట్టాలని సూచించారు. అలాగే స్థానికంగా ఉన్న గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులు, సిక్ రూమ్ నిర్వహణపై సమీక్షించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ బి.ఐశ్వర్య, హెచ్ఎం గోవిందరావు, డెమో యోగీశ్వరరెడ్డి, సూపర్ వైజర్ జయ, వైద్య సిబ్బంది ఉన్నారు.

సొంత నిధులతో రచ్చబండ నిర్మాణం

ప్రజాశక్తి - బలిజిపేట

పెదపెంకిలో శ్మశానం వద్ద నేతాజీ గ్రంథాలయం వ్యవస్థాపకులు ఈర్ల సంజీవ్ నాయుడు నాటి పెంచిన మర్రి మొక్క వద్ద ఈర్ల సంజీవ్ నాయుడు, రౌతు మురళి ఇద్దరు తమ స్వంత డబ్బులు రూ.30వేలతో రచ్చ బండ నిర్మించారు. ఈ సందర్భంగా సంజీవనాయుడు మాట్లాడుతూ చిన్నపటి నుండి శ్మశానం వద్ద పెంచిన మొక్క పెద్దది కావడం వల్ల దహన సంస్కరాల సమయంలో ఉపయోగపడుతుందని తామిద్దరం ఈ పని చేయడానికి ముందుకు వచ్చామని అన్నారు.



రచ్చబండ నిర్మిస్తున్న సంజీవనాయుడు